క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక



సాయిప్రణతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ఎన్ఎంఎంఎస్‌కు మండలంలోని బూరుగుపాలెం విద్యార్థిని ఎస్.సాయి ప్రణతి ఎంపికైంది. 2024–25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన అర్హత పరీక్షలో స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆమె ఎంపికైందని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి గురువారం తెలిపారు. సాయిప్రణతికి ఇంటర్ పూర్తి చేసేవరకు ఏటా రూ.12,000 చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం కావాలి



మొక్కలు నాటుతున్న ఎంఈవో మూర్తి, తదితరులు

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణే అందరి లక్ష్యం కావాలని ఎంఈవో మూర్తి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో లైఫ్ ఫర్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు అన్ని పాఠశాలల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థులు, పెద్దలు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు మొక్కలను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు తప్పనిసరి

మాడుగుల రూరల్: మండలంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విధిగా ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలని ఎంఈవో–2 బి. దేముడమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఆర్సీఎం పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఐదు శాతం ఇండెంట్ పెట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలకు టాయిలెట్స్, మరుగుదొడ్లు, ఆట స్థలం, తదితర మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు.

16న సరస్వతీదేవి పూజ

చోడవరం రూరల్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 16న విద్యార్థులతో వాగ్దేవి పూజ నిర్వహించనున్నట్టు వాసవి యూత్ క్లబ్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో ఆదివారం ఉదయం 7 గంటలకు సరస్వతీ పూజ నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే వారు పూలు తీసుకుని రావలసిందిగా తెలిపారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు పెన్ను, పెన్సిల్, ఎరాసర్, షార్పనర్, స్కేల్‌తోపాటు అమ్మవారి రక్షను అందజేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు ఆలయానికి చేరుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ డైరెక్టర్ల పదవులకు రాజీనామా

మాడుగుల రూరల్: రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లవిల్లి ప్రభావతి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా బి.సి. సంక్షేమ శాఖాధికారికి అందజేశామన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను ఈ పదవిలో నియమించారన్నారు. వారికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నాతవరం: రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టరు పైల పోతురాజు తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ కార్యదర్శికి పంపించానని ఆయన గురువారం తెలిపారు. తనకు పదవి అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విధాలుగా సహకరించిన మండలంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పాఠశాలల సందడి



కాశీపురం హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కాశీపురం హైస్కూల్‌కు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



రోలుగుంట పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

- బడిబాట పట్టిన విద్యార్థులు
- తొలి రోజు అరకొరగా హాజరు

బడి గంట మోగింది. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులతో సందడిగా మారాయి. వేసవి సెలవులతో రెండు నెలల పాటు మూతపడిన ఇవి తిరిగి తెరుచుకున్నాయి.

మాడుగుల రూరల్: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభమయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరం సందర్భంగా మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోవడంతో తొలి రోజు అరకొరగా విద్యార్థులు హాజరయ్యారు. వీరికి పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫాం, షూ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవరాపల్లి: వేసవి సెలవులు అనంతరం గురువారం అన్ని పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులంతా బడిబాట పట్టారు. వేసవి సెలవుల్లో ఆటపాటలు, విహార యాత్రలు, బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి సరదాగా గడిపిన వీరంతా ఉదయాన్ని పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థుల రాకతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఎం.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

రోలుగుంట: మండలంలో ఎంపీ, యూపీ, జెడ్పీ ఉన్నత, కేజీబీవీతో కలపి 54 పాఠశాలలు వేసవి సెలవులు అనంతరం పునః ప్రారంభమయ్యాయి.



పాఠశాలలకు వాహనంపై పాఠ్య పుస్తకాలు పంపిస్తున్న ఎంఈవో జాను ప్రసాద్

ఈ సందర్భంగా ఇప్పటి వరకు వచ్చిన పాఠ్య, నోట్ పుస్తకాలను ఎంఈవో జాను ప్రసాద్ ప్రత్యేక వాహనాలపై ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. హెచ్ఎంల నుంచి విద్యార్థుల జాబితా తీసుకొని వాటి ఆధారంగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇప్పటి వరకూ వచ్చిన పాఠ్యపుస్తకాలు పంపించామన్నారు. ఇంకా మరి కొన్ని రావాల్సి ఉందన్నారు. వచ్చిన వెంటనే వాటిని హెచ్ఎంలకు సమాచారం ఇచ్చి అందజేస్తామన్నారు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆందోళన



ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నర్సీపట్నం: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అధిక ఫీజుల వసూళ్లను నిరసిస్తూ గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్డీవో హెచ్.వి.జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివిధ రకాల ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. మండల విద్యా శాఖాధికారి తక్షణమే దృష్టి సారించి అధిక ఫీజులు వసూళ్లను అరికట్టాలన్నారు. ఇది వరకే ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి, నాయకులు జగదీష్, అరుణ్‌సాయి, ప్రేమ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా మోదమాంబ సారె ఊరేగింపు



వీరవల్లి అగ్రహారంలో సారె ఊరేగిస్తున్న భక్తులు



సారె ఊరేగింపులో మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో మోదమాంబ సారె ఊరేగింపు గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఇక్కడ మోదమాంబ పీఠం నుంచి మాలధారణ భక్తులు ఈ కార్యక్రమం ప్రారంభించారు. పురవీధుల్లో 101 రకాల పిండి వంటలు, పండ్లు, జీలుగుకల్లు, తాటి, ఈతకాయలు, తదితర నైవేద్య సామగ్రిని ఊరేగించారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి సమర్పించారు. అనంతరం మోదమాంబ ఆలయం వద్ద సారెను భక్తులకు పంపిణీ చేశారు.

ప్రశాంతంగా మోదకొండమ్మ పండగ

- అధికారులతో ఎమ్మెల్యే బండారు సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

మాడుగుల: మోదకొండమ్మ పండగను ప్రశాంతంగా నిర్వహించడానికి ఆలయ, ఉత్సవ కమిటీలకు మండల స్థాయి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక తులసీ కల్యాణ మండపంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. పండగ సందర్భంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వన్ వే ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరచడంతోపాటు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. అగ్నిమాపక అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా మాడుగుల వచ్చిన ఆయన మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులు ఘన స్వాగతం పలికి, దుశ్శాలువా కప్పి సత్కరించారు. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీపీవో ఆర్. శిరీషారాణి, డీఎంహెచ్‌వో బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, కమిటీ సభ్యుడు దేవరాపల్లి శ్రీనువాసరావు పాల్గొన్నారు.

బండారును కలిసిన జిల్లా వ్యవసాయాధికారి

మాడుగుల రూరల్: మాడుగుల నూతన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని జిల్లా వ్యవసాయాధికారి బి. మోహన్‌రావు గురువారం సాయంత్రం మాడుగులలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏవో వాసుదేవరావు, ఏఈవో డి. సత్యనారాయణలతో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల సరఫరా



పాఠశాలలకు వాహనాలపై పుస్తకాలు తరలిస్తున్న ఎంఈవో - 2 వరహాలబాబు



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో దేముడమ్మ



కొండలఅగ్రహారంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల: పాఠశాలల పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మండలంలో అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను ఎంఈవో దేముడమ్మ గురువారం సరఫరా చేశారు. స్థానిక బాలికల హైస్కూలులోని ఒక గదిలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు భద్రపరిచారు. వీటిని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి పంపిణీ చేస్తున్నారు. మండలంలో 69 పాఠశాలలకు సంబంధించి ఇంత వరకు 9,665 పాఠ్య పుస్తకాలు వచ్చాయని, పదో తరగతిలో ఫిజికల్ సైన్సు తప్ప మిగిలిన పాఠ్య పుస్తకాలు ఉన్నాయన్నారు. కొన్ని తరగతులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు రావల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని 38 పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సరఫరా అయిన పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు బూట్లు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన కిట్లు రావాల్సి ఉందని ఎంఈవో మూర్తి తెలిపారు. 54 పాఠశాలలకుగాను 38 పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటివరకు వచ్చిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు పంపిణీ చేశామన్నారు. బ్యాగు, యూనిఫాం రాగానే పంపిణీ చేస్తామన్నారు.

30 వేల పాఠ్య, 24 వేల నోట్ పుస్తకాల తరలింపు

నాతవరం: ఉపాధ్యాయులకు ఎలాంటి శ్రమ లేకుండా ఎమ్మార్సీ సిబ్బందితో నేరుగా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇతర సామగ్రి తరలిస్తున్నామని ఎంఈవో– 2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఆయన గురువారం స్థానిక హైస్కూల్ స్టాకు పాయింట్ నుంచి మండల వ్యాప్తంగా పాఠశాలలకు వీటిని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలానికి ఇంతవరకు 30 వేలకుపైగా పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వాటిలో పదో తరగతికి సంబంధించి పుస్తకాలు పూర్తిగా రావడంతో ఆయా హైస్కూళ్లకు సరఫరా చేశామన్నారు. మరో 15 వేలకుపైగా పాఠ్య పుస్తకాలు మండలానికి రావలసిందన్నారు. 24,980 నోట్ పుస్తకాలు వచ్చాయని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది అంకంరెడ్డి శ్రీనివాసులనాయుడు, సాంబ, నాయుడు, సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, గోవిందు, సత్యవేణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా మరిడితల్లి పండగ



అమ్మవారికి కానుకలు ఇస్తున్న భక్తులు



పరుగు తీస్తున్న ఎడ్లబండి

గొలుగొండ: మండలంలో కొంకసింగిలో మరిడితల్లి జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొలువైన అమ్మవారిని గ్రామస్తులతోపాటు ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, నాగాపురం, లింగంపేట, పాడి, రత్నంపేట తదితర గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు చేసి కానుకలతో మొక్కులు సమర్పించుకున్నారు. పండగ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పందేలు హోరాహోరీగా సాగాయి. వీటిని తిలకించడానికి సమీప ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈలలు, కేకలతో సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి పది జతల ఎడ్లబళ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల చొప్పున కమిటీ సభ్యులు అందజేశారు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



రైవాడ ఆర్బీకేలో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి

దేవరాపల్లి: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఖరీఫ్ వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చల్లా లక్ష్మి కోరారు. గురువారం రైవాడ రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఖరీఫ్ వరి విత్తనాలను ఆమె రైతులకు పంపిణీ చేశారు. సోనామసూరి, సాంబమసూరి, అమర, శ్రీధృతి, స్వర్ణ, నెల్లూరు సన్నాలు, శ్రీకాకుళం సన్నాలు తదితర రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ పెద్దలు చల్లా నాయుడు, చల్లా నానాజీ, మండల వ్యవసాయ విస్తరణాధికారి, స్థానిక ఆర్బీకే ఇన్‌చార్జి ఎస్. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ కాటా అప్‌గ్రేడ్



ఆయిల్‌పామ్ కాటాను ప్రారంభోత్సవంలో పతంజలి కంపెనీ అధికారులు

కోటవురట్ల: ఆయిల్‌పామ్ రైతుల కోసం పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ కాటాను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో ఈ కంపెనీకి సంబంధించి 2 టన్నుల సామర్థ్యాన్ని లెక్కించే కాటా ఉండేది. మండలంలో ఆయిల్‌పామ్ సాగు గణనీయంగా పెరగడంతో ఉత్పత్తి కూడా పెరిగింది. కాటా సరిపోకపోవడంతో రైతులు వేరే ప్రాంతాలకు ఆయిల్ పామ్ గెలలను తీసుకువెళ్లాల్సివచ్చేది. సమస్యను గుర్తించిన అధికారులు 2 టన్నుల కాటాను మార్చి 20 టన్నుల కాటాను కోటవురట్లలో ఏర్పాటు చేశారు. దీన్ని పతంజలి ఏజీఎం పట్టాభిరామిరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్ గురువారం ప్రారంభించి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

60 మందికి వైద్య సేవలు

మాడుగుల రూరల్: మాడుగుల పాల సొసైటీ వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు ఆధ్వర్యంలో 60 మందికి వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్, తదితర వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గుండె చికిత్స ఉచిత వైద్య శిబిరం

చోడవరం రూరల్: స్థానిక సంజీవనీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం గుండె చికిత్స ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలను ఉచితంగా అందించడమే గాకుండా కార్డియాలజిస్ట్ పృథ్వీరాజ్ అట్టాడ హృద్రోగులను పరీక్షించి తగు వైద్య చికిత్స అందచేస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ శిబిరానికి హాజరయ్యే రోగులు ముందుగా 9603378145 నంబర్‌కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరాయి.

రేపు కె.జె.పురంలో శ్రీరాధాకృష్ణుల తీర్థం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంట రహదారిలో రాపేట వారి కళ్లాల వద్ద శ్రీరాధాకృష్ణుల తీర్థం ఈ నెల 15న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

వరినారు మడి తయారీలో రైతులు



ట్రాక్టరుతో నారుమడికి దుక్కి చేస్తున్న రైతు

నాతవరం: ఖరీఫ్ సాగులో వరి పంట వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ముందుగా దుక్కి చేసి వరి నారుమడి సిద్ధం చేసే పనిలో ఉన్నారు. జిల్లాలోనే నాతవరం మండలంలో ఖరీఫ్‌లో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తుంటారు. తాండవ రిజర్వాయరు నీరు సదుపాయం ఉన్నందున ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వరి సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాల కోసం రైతులు ఆన్‌లైన్లో నమోదు చేసుకుంటున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1,799 క్వింటాళ్లు వరి విత్తనాలు సరఫరా చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. పొలాలు సారవంతంగా ఉండేందుకు పచ్చిరొట్ట, జీలుగు, జనుము విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు.

వైభవంగా మరిడిమాంబ, బంగారమ్మ పండగ



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు




ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు

కె.కోటపాడు: చౌడువాడలో గ్రామదేవతలు మరిడిమాంబ, బంగారమ్మ పండగ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో యువకులు ప్రసాద వితరణ చేశారు. పండగ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

- ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్



ఆర్లిలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

కె.కోటపాడు: బడిఈడు పిల్లలను వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో –1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ కోరారు. మండలంలో ఆర్లి, జోగన్నపాలెం, కె.కోటపాడు పాఠశాలలను వీరు గురువారం తనిఖీలు చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా గ్రామాల్లో బడిఈడు పిల్లలు ఎంత మంది ఉన్నారో ఉపాధ్యాయులు గుర్తించాలని సూచించారు. వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తున్నారని, ప్రతీ విద్యార్థిపైన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వివరించాలన్నారు. హెచ్ఎం సతీష్, సర్పంచ్ బోళెం సందీప్, పీఎంసీ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.